# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 18-07-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ఆంధ్రప్రదేశ్ హైడ్రోజన్ వ్యాలీగా మారాలన్నది రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- ఆత్మ నిర్భర్ భారత్ కి నిదర్శనంగా 'ఐఎన్ఎస్ నిస్తార్' నౌక నిలుస్తుందని కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ అన్నారు.
- సైబర్ నేరాలపై కఠిన చర్యలు తీసుకునేలా వచ్చే శాసన సభ సమావేశాలలో చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టనున్నామని ఉప సభాపతి కె. రఘు రామకృష్ణ రాజు పేర్కొన్నారు.
- పూర్తి అనుమతులతోనే బనకచర్ల ప్రాజెక్టును ప్రారంభిస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు.
- ఆకాంక్షాత్మక జిల్లాల ప్రగతిపై కేంద్ర మంత్రి ఇంద్రజిత్ సింగ్ ఈరోజు విశాఖలో సమీక్ష నిర్వహించారు.

===================

ఆంధ్రప్రదేశ్ హైడ్రోజన్ వ్యాలీగా మారాలన్నది రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. గుంటూరు జిల్లాలోని అమరావతి SRM యూనివర్సిటీలో ఈరోజు జరిగిన గ్రీన్ హైడ్రోజన్ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలో హైడ్రోజన్ వ్యాలీకి అవసరమైన సాంకేతికతను అందుబాటులోకి తీసుకుని వచ్చే బాధ్యత వివిధ సంస్థల అధిపతులు తీసుకోవాలని కోరారు. ఉష్ణ తాపం బాగా పెరిగిపోతున్న నేపథ్యంలో గ్రీన్ హైడ్రోజన్ ప్రాధాన్యం పెరిగిందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఉన్న అవసరాలకు అనుగుణంగా గ్రీన్ హైడ్రోజన్‌తో విద్యుత్తు ఉత్పత్తికి ఉన్న అవకాశాల గురించి చర్చించాలని చంద్రబాబునాయుడు పేర్కొంటూ..

(వాయిస్ బైట్...29 సెకన్లు)

కాగా.. ఈ సదస్సుకు కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, నీతి ఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ తదితరులు హాజరయ్యారు.

===================

సైబర్ నేరాలపై కఠిన చర్యలు తీసుకునేలా వచ్చే శాసనసభ సమావేశాలలో చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టనున్నామని రాష్ట్ర శాసనసభ పిటిషన్ల కమిటీ చైర్మన్, శాసనసభ ఉప సభాపతి కె. రఘు రామకృష్ణ రాజు తెలిపారు. పటిష్టమైన చట్ట రూపకల్పనకు హోం, ఐటి శాఖ కార్యదర్శులతో శాసనసభ పిటిషన్ల కమిటీ సమావేశంలో సమగ్రంగా చర్చించామన్నారు. అమరావతిలోని శాసనసభ భవనంలో ఈరోజు సమావేశం నిర్వహించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో జరుగుతున్న సైబర్ నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ శాసనసభ పిటిషన్ల కమిటీ ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. దీనికి సంబంధించి సమగ్రమైన నివేదికను తమ కమిటీ త్వరలో శాసనసభ స్పీకర్ కు నివేదించనుందని తెలిపారు.

===================

ఆత్మ నిర్భర్ భారత్ కి నిదర్శనంగా 'ఐఎన్ఎస్ నిస్తార్' నౌక నిలుస్తుందని కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ తెలిపారు. పూర్తిగా స్వదేశీయ పరిజ్ఞానంతో తయారుచేసిన ఈ నౌకను ఈరోజు ఆయన విశాఖపట్నంలో జాతికి అంకితం చేశారు. తూర్పు నౌకాదళ ముఖ్య కార్యాలయం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భారత నేవీ అడ్మిరల్ దినేష్ కె.త్రిపాఠి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కేంద్రమంత్రి మాట్లాడుతూ.. భారత నావికాదళం అమ్ముల పొదిలో మరో అత్యాధునిక నౌకగా 'ఐఎన్ఎస్ నిస్తార్' ని పేర్కొన్నారు. దీని వలన భారత నావికా దళ సామర్ధ్యం మరింతగా పెరిగిందని వెల్లడిస్తూ...

(వాయిస్ బైట్...25 సెకన్లు)

===================

గోవా గవర్నర్‌గా నియమితులైన కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక గజపతిరాజు ఈరోజు విశాఖ నగరానికి సమీపంలో ఉన్న సింహాచలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రంలో వెలసిన శ్రీ వరహాలక్ష్మీ నరసింహస్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి వేంద్ర త్రినాధరావు ఆధ్వర్యంలో ఆలయ అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అంతకు ముందు తెలుగుదేశం పార్టీ జీవిత కాల సభ్యత్వానికి, పొలిట్‌బ్యూరో పదవికి అశోక్ గజపతిరాజు రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడుకు పంపించారు.

===================

విరామం

===================

పూర్తి అనుమతులు వచ్చిన తరువాతనే రాష్ట్రంలో బనకచర్ల ప్రాజెక్టును ప్రారంభిస్తామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. విశాఖపట్నంలో ఈరోజు పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ, బనకచర్ల ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీ అనుమతులు వస్తాయని భావిస్తున్నామని అన్నారు. గోదావరి నుంచి ప్రతి ఏటా 3 వేల టీఎంసీల నీరు సముద్రంలోకి వృథాగా పోతోందని మంత్రి చెప్పారు. అందులో 200 టీఎంసీల నీరు వాడుకోవడం ద్వారా బనకచర్ల ప్రాజెక్టును నిర్మిస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఏడాదిలోనే హంద్రీనీవా ప్రాజెక్ట్ ను పూర్తి చేసి నీటిని విడుదల చేసిందని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ బైట్...32 సెకన్లు)

===================

రాష్ట్రంలో 85 లక్షల టన్నుల చెత్తను తొలగించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి.నారాయణ తెలిపారు. అనంతపురం జిల్లా పర్యటనలో భాగంగా ఈరోజు ఆయన లెగసీ డంపింగ్ యార్డ్ వద్ద ప్రాసెసింగ్ యూనిట్ కి శంకుస్థాపన చేశారు. అనంతపురం నగరపాలక సంస్థలో 1 కోటి 70 లక్షల సాధారణ నిధులతో రోడ్డు కాలువల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ, రాబోయే మూడు నెలలలో చెత్తను తొలగించే కార్యక్రమం పూర్తవుతుందని అన్నారు. రాష్ట్రంలో చెత్తపై పన్ను రద్దు చేశామని చెప్పారు. ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించడం జరుగుతుందని మంత్రి పేర్కొంటూ..

(వాయిస్ బైట్...23 సెకన్లు)

===================

కేంద్ర ప్రణాళికా గణాంకాలు కార్యక్రమాల అమలు శాఖ మంత్రి ఇంద్రజిత్ సింగ్ ఈరోజు విశాఖ జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా విశాఖ కలెక్టర్ కార్యాలయంలో ఆకాంక్షాత్మక జిల్లాల ప్రగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆకాంక్షాత్మక జిల్లాలుగా నీతి ఆయోగ్ గుర్తించిన పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో వైద్య ఆరోగ్య రంగం, విద్య, వ్యవసాయ, నీటిపారుదల రంగాల్లో సాధించిన ప్రగతి గురించి కేంద్ర మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమీక్షా సమావేశంలో అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్ తో పాటు రెండు జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

===================

కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం ఉప్పాడ ప్రాంతంలో సముద్ర తీర ప్రాంత కోత సమస్యకు త్వరలో శాశ్వత పరిష్కారం లభించనుందని ఉప ముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్ వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం, జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్‌డీఎంఏ) ద్వారా ఉప్పాడలో సుమారు 323 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో తీర రక్షణ నిర్మాణాలను అభివృద్ధి చేసే ప్రతిపాదనను ఎన్డీయే కూటమి ప్రభుత్వం చురుగ్గా  పరిశీలిస్తోందని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా తెలిపారు. గత ఐదేళ్లలో సగటున ఏటా 1.23 మీటర్ల తీరం కోతకు గురైందని ఆయన పేర్కొన్నారు. దీంతో సుమారు 12 మీటర్ల తీరం కోల్పోయిందని అన్నారు. ఇది సమీప గ్రామాలు, మత్స్యకారుల గృహాలపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆయన వివరించారు.

===================

దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్, దాని పరిసర ప్రాంతాలలో ఉపరి తల ఆవర్తనం నెలకొని, సగటు సముద్ర మట్టానికి 5.8 కి.మీ ఎత్తు వరకు విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రాగల మూడు రోజుల వరకు ఉత్తర కోస్తా జిల్లాలలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. అలాగే.. దక్షిణ కోస్తా రాయలసీమలో మోస్తరు వానలు పడతాయని వివరించింది.

===================

===================